# దేశ రక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయం




**మంత్రి గంగుల కమలాకర్**

కొత్తపల్లి, ఆగస్టు 28 (మనం న్యూస్): దేశానికి సేవ చేయాలనే ఆలోచనతో దేశ రక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయమని బిసి సంక్షేమం, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపల్లి మండల కేంద్రంలోని స్థానిక ఫంక్షన్ హాల్ లో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి మంత్రి గంగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ రక్షణ చేయడం అనేది పవి త్ర వృత్తి అని, దేశ రక్షణలో తమ పిల్లలు ఉండాలని కోరుతూ శిక్షణకు పంపించిన తల్లితండ్రులకు నా ప్రణామమని అన్నారు. కన్న తల్లిదండ్రులను మనం ఏ విధంగా గౌరవిస్తామో దేశాన్ని కూడా అలాగే గౌరవించాలన్నారు. ఇంటర్ నుండి దేశ రక్షణలో భాగ స్వాములు కావాలని బాధ్యతగా ఎదుగుతున్న మీ భవిష్యత్ గొప్పగా ఉండాలని కోరుకుంటున్నార న్నారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో ఉద్యోగా లు లేక వలసలు వెళ్ళే పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుతం స్వరాష్ట్రంలో మన రాష్ట్రానికి ఇతర రాష్ట్రాల వారు ఉద్యోగాల కోసం వలసలు వస్తున్నారని తెలిపారు. కష్టపడి చదివే వారికి తెలంగాణ ప్రభు త్వంలో ఒక ఉద్యోగం మీ కోసం ఎదురు చూస్తూ ఉం టుందని అన్నారు. చేసే వృత్తి ఎదైనా గౌరవంగా ఉండాలని, ఒకప్పుడు రాజకీయాలు అంటే గౌరవం ఉండేది కాదని నేడు ఆ పరిస్థితి పోయిందని అన్నారు. ఎమ్మెల్యే అంటే ఒక గౌరవం వచ్చిందని, నేటి యువత రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్ననని పిలుపునిచ్చారు. ఒక డాక్టర్ ఫెయిల్ అయితే ప్రాణం పోతుందని, ఒక ఇంజినీర్ ఫెయిల్ అయితే బ్రిడ్జి కూలిపో తుందని, అదే ఒక లీడర్ ఫెయిల్ అయితే సమాజం కుప్పకూలి పోతుందని అన్నారు. అందుకే ఒక మంచి అడ్మినిస్ట్రేటర్ నాయకుడు అయితే దేశం బాగుంటుం దని అన్నారు. ఒకప్పుడు కరీంనగర్ అనగానే నేను రాను అనే పరిస్థితి నుండి నేడు హైదరాబాద్ తర్వాత రెండో గొప్ప నగరంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. రేపటి తరాల కోసమే నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని, భవిష్యత్ అంతా మీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సునీల్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డ వేణి మధు,కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ట్రస్మా చైర్మన్ శేఖర్ రావు, డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
మంగళవారం | 29 | ఆగస్టు | 2023 | పేజీలు : 8

# పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి



రామగిరి,ఆగస్టు 28 మనం న్యూస్ : బుధవారంపేట గ్రామపంచాయతీ పరిధిలోని 708 ఎకరాల 16 గుంట లకు గత తొమ్మిది నెలల క్రితమే హైకోర్టు భూసేకరణ చట్టాన్ని రద్దు చేయడం జరిగింది.హైకోర్డు ఆదేశాలను సింగరేణి వారు,ప్రభుత్వం ధిక్కరిస్తూ అదే బుధవారం పేట గ్రామపంచాయతీ పరిధిలోని 88 ఎకరాలకు నో టిషికేషన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. హైకోర్టు ఆదే శాల ప్రకారం 708 ఎకరాల 16 గుంటలకు కొత్త పాసు బుక్కులు,గతంలో నష్టపోయిన రైతుబంధు,రైతు బీమా ఇచ్చేవరకు సింగరేణి వారు కొత్త నోటిపికేషన్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు. 708 ఎకరాల 16 గుంటల సమస్యను పరిష్కరించే వరకు 88 ఎకరా లకు నోటిఫికేషన్ ఇస్తే బుధవారంపేట గ్రామప్రజలు ,రైతులు పోరాటానికి సిద్ధంగా ఉన్నారనీ, సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని రాజాపూర్ సర్పంచ్ పాశం ఓదెలుయాదవ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుధవారంపేట ఉపసర్పంచ్ నరేష్‌యా దవ్, అక్కపెల్లి వార్డ్ మెంబర్ సిద్ధ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికబద్ధంగా ప్రభుత్వ పథకాలను పూర్తిచేయాలి

**సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహణ**

**ఆసరా ఫించన్ బదిలీ 3రోజులలో పూర్తిచేయాలి**

**గొర్రెల పంపిణీ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలి**

**గృహలక్ష్మీ లబ్దిదారుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలి**

**దళితబంధు రెండవ విడత లబ్దిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలి**

**వీడియో కాన్పరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**



పెద్దపల్లి, ఆగష్టు 28(మనం ప్రతినిధి): ప్రణాళికబద్దంగా ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు, లక్ష్యాలపై వీడియో కాన్పరెన్స్ నిర్వహించారు. ఈవీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్‌లు జె.అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. వీడియో కాన్పరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్వాతంత్ర వజ్రోత్సవ ముగింపు వేడుకలు, తెలంగాణకు హరితహారం, ఆసరా ఫించన్, గొర్రెల పంపిణీ, బీసీ, మైనారిటీ లకు ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, దళితబంధు, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59కారుణ్య నియామకాలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ వంటి పలు అంశాలపై సీఎస్ జిల్లా కలెక్టర్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో సమీక్షిస్తూ హైదరాబాద్ లో స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి జిల్లా నుంచి హాజరయ్యే విధంగా అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వృద్దాప్య, ఆసరా ఫించన్ దారులు మరణించిన పక్షంలో వారి భాగస్వామికి పెన్షన్ బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింద ని, క్షేత్రస్తాయిలో పెండింగ్‌లో ఉన్న ఆసరా ఫించన్ దరఖాస్తులను మూడు రోజులలో మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం క్రింద మన జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటున్నామని, ఇప్పటి వరకు 708గొర్రెల యూనిట్ల పంపిణీ చేశామని, భవిష్యత్తులో ఇదే రీతిలో త్వరితగతిన యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బీసీ కులవృత్తుల కింద లక్ష రూపాయల

మిగతా 2లో..

## బాలిక ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

### ఫోక్సో చట్టం ప్రకారం దోషులను కఠినంగా శిక్షించాలి

### తెలంగాణ రాష్ట్ర బాలల హక్కులు, సంరక్షణ (చైల్డ్‌రైట్స్)కమీషన్ సభ్యులను కలిసిన ప్రజాసంఘాల నాయకులు



పెద్దపల్లి, ఆగష్టు 28(మనం ప్రతినిధి)పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలి బాలికపై అత్యాచారం, హత్య ఘటనపై సమగ్రవిచారణ జరిపించాలని ఫోక్సో చట్టం ప్రకారం దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కులు, సంరక్షణ (చైల్డ్‌రైట్స్)కమీషన్ సభ్యులను సోమవారం ప్రజాసంఘాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. బాలికపై అత్యాచారం, హత్య ఘటన జరిగి 14రోజులు గడుస్తున్న ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని, ఈఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఫోక్సో చట్టం ప్రకారం దోషులను కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అలాగే జిల్లా వ్యాప్తంగా బాలికలపై జరుగుతున్న ఆకృత్యాలపై వెంటనే కమీషన్ స్పందించాలని ఆవినతిలో కోరారు. జిల్లా వ్యాప్తంగా ఇటుక బట్టిలలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వలస కార్మికులకు ప్రభుత్వం తరుపున కార్మికశాఖ,రెవెన్యూ ద్వారా సంక్రమించే అన్ని సదుపాయాలను కల్పించాలని ఈసందర్భంగా కమీషన్ సభ్యులను సంఘాల నాయకులు కోరారు. కమీషన్ సభ్యులను కలిసిన వారిలో దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్యలు ఉన్నారు.

# ప్రణాళికబద్ధంగా ప్రభుత్వ పథకాలను పూర్తిచేయాలి




మొదటి పేజీ తరువాయి..

ఆర్థిక సహాయం మొదటి దశలో మంజూరైన చెక్కుల పంపిణీ పూర్తియినందున, రెండవ దశ అమలుకు చర్యలు తీసుకోవాలని, రెండవ విడతలో ఆన్‌లైన్ మాత్రమే మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహలక్ష్మి పథకం క్రింద జిల్లాలో మొదటి దశ దరఖాస్తుల పరిశీల న పూర్తయిందని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్దిదారుల జాబితా జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తీసుకొని మంజూరు చేయాలని, ఆన్‌లైన్ యాప్‌లో వివరాల నమోదు పక్రియ వారం రోజులలో పూర్తి చేయాలని, అనంతరం ఇండ్ల నిర్మాణ పనులు మొదలు కాగానే మొదటి విడత లక్ష రూపాయలు నిధులు విడుదల చేయడం జరుగుతుందని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. రెండవ విడత దళితబంధు పథకం కింద జిల్లా మంత్రిచే ఆమోదించిన జాబితా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈసమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ శ్రీనివాస్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, డి.ఎఫ్.ఓ శివయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మద్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మేము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం

## విద్యార్థిదశ నుంచే సైబర్ మోసాలను గుర్తించాలి

### పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్

పెద్దపల్లి, ఆగష్టు 28 (మనం ప్రతినిధి): విద్యార్థి దశనుండే సైబర్ మోసాలను గుర్తించాలని, మేము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని పెద్దపల్లి డీసీపీ వైభవ్ గౌక్వాడ్ అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమీషనర్ రెమో రాజేశ్వరీ (డిఐజి) ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వెంకట పద్మ కన్వెన్షన్‌లో పెద్దపల్లి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత పోలీసుల బాధ్యత అనే కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలు, నిబంధనల గురించి తెలిపారు. విద్యార్థి దశలో ఎదురయ్యే ఇబ్బందులను ఎలా అధికగమించాలో అధికారుల సహాయం ఎలా పొందాలో వివరించారు. నేడు ఆధునిక సాంకేతిక పెరుగుతున్న వేళ సైబర్ వేధింపులకు గురికాకుండా ముందు జాగ్రత్తల గురించి తెలిపారు. బెదిరింపులకు పాల్పడే ఘటనల గురించి ఎలా భయట పడాలో విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు కాలేజీలో ఎదురయ్యే సమస్యలను, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉండే శిక్షల గురించి వివరించారు. ఏసమస్య ఎదురైనా విద్యార్థులు డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. విద్యార్థీనులు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి, సమాజంలో నిత్యం జరుగుతున్న సైబర్ క్రైం నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, చదివే విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా, విద్యకు దగ్గరగా ఉండి తమ లక్షా్యలను అధిరోహించాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్తితులలో చెప్పొద్దని యూపిఐ పేమెంట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్థిక పరమైన సైబర్ నేరాలు జరిగిన సమయంలో హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేయాలని తెలిపారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, మహిళలు విద్యార్థీనీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే జరిమానాలతో పాటు జైటు శిక్ష తప్పదన్నారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్, సైబర్ క్రైం ఇన్స్పెక్టర్ రహీమ్‌పాషా, ఎస్సైలు మహేందర్, మల్లేష్, అష్విని, షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్, పెద్దసంఖ్యలో పలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.







# మంత్రి గారూ... డబుల్ బెడ్రూంల సంగతేంది..?

## సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి

## చింతకుంట డబుల్ బెడ్‌రూంల వద్ద ధర్నా



కొత్తపల్లి, ఆగస్టు 28 (మనం న్యూస్)ః కరీంనగర్ శాసనసభ నియోజకవర్గంలో ఇంత వరకు అందించని డబుల్ బెడ్‌రూం సంగతేంటో మంత్రి గంగుల కమలాకర్ ప్రజలకు తెలియజేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నిర్మాణ పనులు మొదలు పెట్టి ఆరు సంవత్సరాలైనా డబుల్ బెడ్రూం ఇండ్లు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. చింతకుంట వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఫ్లాట్ల దగ్గర నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం నగరంలో పదిహేను వేల మంది దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇవ్వలేదని కనీసం ఇప్పటికైనా పూర్తి చేసి కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరసనకు దిగిన వెంటనే పాలకులు పోలీసులను పంపించి నిరసన విరమించకపోతే కేసులు పెడతామని మహిళలను కూడా బెదిరింపులకు గురిచేశారన్నారు. మంత్రి గంగుల కమలాకర్ కు ఏమాత్రం చిత్త శుద్ధి ఉన్నా వెంటనే పెండింగ్ లో ఉన్న 660 డబుల్ బెడ్రూం ఫ్లాట్లు పూర్తి చేసి లాటరీ పద్ధతిలో పారదర్శకంగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,పొరండ్ల రమేష్,షేక్ శేహెన్షా,షబానా మహమ్మద్,బాలబద్రి శంకర్,ముల్కల కవిత,ఎగ్గడి శారద,అన్నే జ్యోతి,కుర్ర పోచయ్య,ముక్క భాస్కర్,మహాలక్ష్మి,నెల్లి నరేష్,అష్రఫ్ ఖురేషి,మహమ్మద్ భారీ, బషీర్,నాగుల సతీష్,తమ్మడి ఎజ్రా,వంగల విద్యాసాగర్,సొహేల్,రాజ్ కుమార్,హనీఫ్,పెద్దిగారి తిరుపతి, కీర్తి కుమార్,కిషన్ నాయక్,ముల్కల యోన,ఇమ్రాన్,నసీం,ఉప్పరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దివాకర్ రావు ఇంటింటా ప్రచారం



మంచిర్యాల, ఆగస్టు 28 ( మనం న్యూస్ ): మంచిర్యాల నియోజకవర్గం టికెట్ ఖరారు కాగానే ఎమ్మెల్యే దివాకర్ రావు పట్టణం లో ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఇంటింటికి తిరుగుతూ కెసిఆర్ ప్రభుత్వ హయాంలో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మరోసారి తనకు మద్ధతుగా నిలవాలని అభ్యర్థిస్తున్నారు. సోమవారం మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 33 వార్డులో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, ఇతర బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ, తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని పేర్కొంటూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సంక్షేమాభివృద్ధి ఫలాలను అడిగి తెలుసుకుంటూనే, మరోవైపు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## పాలకుల బిసి వ్యతిరేక ధోరణిని ఎండగట్టాలి

### బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రవీందర్‌గౌడ్




చిగురుమామిడి, ఆగస్టు 28 (మనం న్యూస్)ః కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న బిసి వ్యతిరేక ధోరణిని యావత్ బిసి లోకం ఎండగట్టాలని బిసి సంక్షేమ సంఘం హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా అత్యధిక శాతమున్న వెనుకబడిన వర్గాల సంక్షేమాన్ని కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. సోమవారం మండల కేంద్రంలో పల్లె పల్లెకు బిసి చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసి వ్యతిరేక ధోరణితో ముందుకు వెళ్తున్నాయన్నారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా ఉన్న బిసిలకు బి ఆర్ఎస్ పార్టీ కేవలం 23 టికెట్లు ఇవ్వడంలో ఆ పార్టీ ఏ తీరున వ్యవహరిస్తుందో అవగతమవుతుందన్నారు. 15 లక్షలున్న రెడ్డి వర్గాలకు 35 టికెట్లు, ఐదు శాతమున్న మిగతా ఓసి వర్గాలకు 23 టికెట్లు కేటాయించడంలోనే బిసిలపై వారికెంత ప్రేముందో తెలుసుకోవాలన్నారు. విద్య, ఉద్యోగం, సంక్షేమ ఫలాల విషయంలోనూ బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా బిసిలు కళ్లు తెరిచి తమకు జరుగుతున్న అన్యాయంపై పాలకులను నిలదీయాలని, రాబోయే ఎన్నికల్లో బిసిలంతా సంఘటితమై బిసి నాయకులనే గెలిపించుకుని సత్తా చాటాలని రవీందర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు మునిగంటి శంకరాచారి, విటల్, బొమ్మగాని వెంకటేశం గౌడ్, గట్టు మొగిలి, ఆకుల మొగిలి, బండారుపల్లి చంద్రయ్య, కంది శంకర్, సన్న బోయిన రాజేశం, గందె వెంకన్న,, గొట్టపర్తి బొందయ్య, పెసర వెంకటయ్య, పద్యం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు గ్రామశాఖ అధ్యక్షుడిగా జెల్ల ప్రతాప్



చిగురుమామిడి,ఆగస్టు 28( మనం న్యూస్): మాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాల మహానాడు గాగిరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జెల్ల ప్రతాప్ తెలిపారు. గాగిరెడ్డిపల్లి గ్రామంలో మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన జిల్లా ప్రతాప్ ను సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూమాలలు నేటి సమాజంలో ఎన్నో ఆర్థిక అసమానతలు ఎదుర్కొంటున్నారని, వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులుగా జెల్ల శ్రీనివాస్, ఆంజనేయులు, శంకర్, ప్రధాన కార్యదర్శిగా జెల్ల రాజు, సహాయ కార్యదర్శులుగా మహేందర్, రాజ మల్లయ్య, వినయ్ స్వామి, కోశాధికారిగా జెల్ల అశోక్, కార్యవర్గ సభ్యులుగా కిషన్, ప్రకాష్, కుమార్, రాజశేఖర్, శంకర్ బాబు, హరికృష్ణ, అరవింద్,శంకర్, ఆంజనేయులు, సంతోష్, కార్తీక్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఎస్సీ కార్పొరేషన్‌లో మంజూరైన ట్రాక్టర్లను ఇప్పించండి

### కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి పత్రం



సిరిసిల్ల అర్బన్, ఆగస్టు 28 (మనం న్యూస్)ః రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2020-2021 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ట్రాక్టర్లను ఇప్పించాలని లబ్ధిదారులు సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అంత కూడా చదువుకున్న నిరుద్యోగులమని, కుటుంబ పోషణకు ఎలాంటి పని లేక ఎస్సీ కార్పొరేషన్‌లో ట్రాక్టర్లకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు అయ్యాయని తెలిపారు. మంజూరైన ట్రాక్టర్లను ఇంతవరకు లబ్ధిదారులకు అందకపోవడంతో జిల్లా ఐటి పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌ను ఇదివరకే మూడుసార్లు కలిసామని, పలుమార్లు కలెక్టర్ ను, ఎస్సీ కార్పొరేషన్ ఇడిని కలిసి సమస్యను దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇప్పటికైనా కెటిఆర్ స్పందించి ట్రాక్టర్లు మంజూరైన లబ్ధిదారులకు ఇచ్చేలా ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల దేవరాజ్, పల్లె మల్లేశం, పాముల రాజనర్సు, పల్లె రాజేందర్, దేవరాజు, నల్లవెల్లి రాజం, గంగ రాజశేఖర్, కమటం ప్రశాంత్, నేరాళ్ళ ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన మెట్ పల్లి కరాటే విద్యార్థులు



మెట్ పల్లి, ఆగస్టు 28 ( మనం న్యూస్)ః సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ షోటాకాన్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణం నుండి 40 మంది కరాటే విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర షోటోకాన్ కరాటే అధ్యక్షులు పాషా టోర్నమెంట్ ఆర్గనైజర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 25 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా 15 మంది విద్యార్థులు వెండి పతకాలు కైవసం చేసుకున్నట్లు జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై మెమొంటోలు, ప్రశంస పత్రాలను అందజేసినట్లు చీఫ్ కరాటే ఇన్స్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు.

## సైబర్ సెక్యూరిటీ ఎస్‌హెచ్‌ఓగా నరసింహారెడ్డి



కరీంనగర్ క్రైం, ఆగస్టు 28 (మనం న్యూస్)ః నూతనంగా ఏర్పాటు చేయనున్న సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎసిపి వి.నరసింహారెడ్డిని నియమితులయ్యారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఆయన, ఎస్‌డిపిఓగా నల్గొండలో విధులు నిర్వహిస్తూ బదిలీపై కరీంనగర్ వచ్చారు. సైబర్ సెక్యూరిటీ పోలీసు స్టేషన్‌కు ప్రస్తుతం ఎసిపితో పాటు సిఐ ఎస్.సునీల్ ను నియమించారు. 2007 బ్యాచ్ కు చెందిన సునీల్ కామారెడ్డి డి సిఆర్‌బి సి.ఐ గా విధులు నిర్వహిస్తున్న ఆయనను కరీంనగర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎసిపి నరసింహారెడ్డి పోలీస్ కమిషనర్ సుబ్బరాయుడును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు.

## ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఉచిత దంత వైద్య శిబిరం

కొత్తపల్లి, ఆగస్టు 28 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో కరీంనగర్ డెంటిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యం.జయక్రిష్ణరావు, డాక్టర్ పి.భాస్కర్ రెడ్డి, డాక్టర్ అర్పిత జీవన, డాక్టర్ శౌర్య, డాక్టర్ శరత్, డాక్టర్ వీజీరెడ్డి, డాక్టర్ రాకేష్ బాబు, డాక్టర్ మహేశ్వర్ రావు, డాక్టర్ కె.రమ్య, డాక్టర్ సుస్మితారావ్, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ శశివదన శిబిరంలో పాల్గొని దాదాపు 19వందల మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28
ఆర్35

# విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ




ఇల్లంతకుంట, ఆగస్టు 28 (మనం న్యూస్)ః స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముష్కనిపేట గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థినిలకు అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు వీరారెడ్డి సొంత ఖర్చులతో సైకిళ్లను అందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలోఎమ్మెల్సీ కూర రఘోత్తమ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుల చేతుల మీదుగా విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు దూర ప్రాంతాల నుండి నడిచి వస్తూ ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి వీరారెడ్డి సైకిళ్లను అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కునబోయిన భాగ్య లక్ష్మి బాలరాజు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్ చంద్ర, సైకిళ్ల దాత వీరా రెడ్డి, పిఆర్టీయు నాయకులు మాన్వాడ శంకర్, మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కార్యదర్శి సందీప్ రెడ్డి, వెంకటేష్, వంశీధర్ రెడ్డి, కో-ఆప్షన్ మెంబెర్ సలీమ్, కిషోర్ గౌడ్, సత్యనారాయణ. బాబు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కుమారస్వామికి నివాళ్లర్పించిన గీకురు రవీందర్



చిగురుమామిడి, ఆగస్టు 28 (మనం న్యూస్)ః చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు గోపగాని కుమారస్వామి మృతి చెందగా, స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ సోమవారం పార్థివదేహాన్ని సందర్శించి, పుష్ప గుచ్ఛముంచి నివాళుర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి సభ్యులు సాంబారి కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బిల్లా వెంకట్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ పరకాల కొండయ్య, గడ్డం అనిల్ కుమార్, మైలారపు చంద్రయ్య, కాల్వాల జైపాల్, ఎరుకొండ రమేష్, పాకాల రమేష్, కల్వల సంతోష్, దాసరి సాగర్ రెడ్డి, గోపగాని తిరుపతి, జున్నూరి ఐలయ్య, సీపీఐ గ్రామ కార్యదర్శి బోయిని పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## వాగేశ్వరి కళాశాలలో ఘనంగా ఓరియెంటేషన్ కార్యక్రమం




తిమ్మాపూర్, ఆగస్టు 28 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో ఉద్యోగాలు రావాలంటే సాంకేతిక నైపుణ్యంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమన్నారు. కావున ప్రతి విద్యార్థి చదువు తోపాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇన్నోవేషన్స్ పై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు వి.వినోద్, సి.హెచ్ ప్రకాశ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్ర గాయాలు

## ముగ్గురు వ్యక్తులే కారణమని పోలీసులకు ఫిర్యాదు

జమ్మికుంట, ఆగస్టు 28 (మనం న్యూస్)ః జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల తిరుపతి (42) సోమవారం ఉదయం విద్యుత్ షాక్ కు గురై తీవ్ర గాయాలపాలయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి ఎప్పటిలాగే పొలానికి నీరు పెట్టడానికి సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. కరెంటు బోర్డు నుండి ఒక ఇనుప తీగకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఏర్పడకుండా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆ వైరును వేయగా, అది గమనించకుండా తిరుపతి మోటార్ ఆన్ చేసే క్రమంలో షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అది గమనించిన స్థానికులు పట్టణంలోని ఒక ప్రైవేట్ హాస్పటల్ కు తరలించారు. ఈ విషయంపై బాధితుని భార్య వేల్పుల కోమల జమ్మికుంట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉందని వారిని విచారించి న్యాయం చేయాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహిస్తున్నామని పట్టణ సిఐ రమేష్ తెలిపారు.

## ఘనంగా సిఐ రమేష్ జన్మదిన వేడుకలు




జమ్మికుంట, ఆగస్టు 28 (మనం న్యూస్)ః పట్టణ సిఐ బర్పాటి రమేష్ జన్మదిన వేడుకలు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి ఎఎస్ఐ రవి, మడిపల్లి ఉప సర్పంచ్ పోషిని సత్యం, పబ్బు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యవృత్తికి వన్నె తీసుకురావాలి

### డా యెగ్గన శ్రీనివాస్



మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 28 (మనం న్యూస్): టి ఎస్ ఎం సి ఎలక్షన్‌లో హెచ్ ఆర్ డి ఎ ప్యానెల్ తరపున ఈనెల 26వ తారీకున 13 మంది వైద్యులు టి ఎస్ ఎం సి ఎన్నికలకి నామినేషన్ వేయడం జరిగిందని హెచ్ ఆర్ డి ఏ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దగ్గర శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డా యెగ్గన శ్రీనివాస్ మాట్లాడుతు.సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 30 వరకు జరిగే ఏ ఎస్ ఎం సి ఎన్నికల్లో అందరు వైద్యులు భాధ్యతాయుతంగా హెచ్ ఆర్ డి ఏ ప్యానల్ కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇప్పుడు జరిగే ఎన్నికలు కేవలం హెచ్‌ఆర్ డి ఏ పోరాటం వలననే అని వీటితోపాటు వైద్యులకు అలాగే వైద్యవృత్తికి సంబంధించి ఎన్నో సమస్యలపై కోర్టుకి వెళ్ళి 40కి పైన పిల్స్ వేసి గెలవడం జరిగిందని తెలిపారు.

# జ్యోతి హైస్కూల్‌లో ఘనంగా ఓనం వేడుకలు




జగిత్యాల ప్రతినిధి, ఆగస్ట్ 28 (మనం న్యూస్)ః కేరళ రాష్ట్రంలో అతిపెద్ద పర్వదినమైన ఓనం పండుగ వేడుకలను పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో సోమవారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బీయ్యాల హరిచరణ్ రావు మాట్లాడుతూ ఓనం పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియపరిచారు. దక్షిణ భారతదేశ రాష్ట్రమైన కేరళలో అతిపెద్ద పండుగ ఓనం అని, ఇది మలయాళీ కాలగణనంలో మొదటి నెల అయిన చింగంలో (ఆగష్టు-సెప్టెంబర్) వస్తుందని తెలిపారు. ఈ పండుగ మహాబలి ఆ ప్రాంతానికి తిరిగి రావడాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. శ్రవణా నక్షత్రమును మలయాళమున 'తిరువోణము' అంటారని, ఈ పండుగ పది రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు. కేరళ ప్రజల ఆచారాలు, సంప్రదాయాలు వంటి అనేక అంశాలతో ఈ పర్వదినం ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత , కేరళ ఉపాధ్యాయులు మోలీ బిజూ, రాజేష్, అనురాజ్ , మొబిన్ జోసెఫ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంధత్వరహిత సమాజం కోసం కృషి

### సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు నరహరి



జమ్మికుంట, ఆగస్టు 28 (మనం న్యూస్)ః అంధత్వరహిత సమాజం కోసం సదాశయ ఫౌండేషన్ కృషి చేస్తోందని సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు నరహరి తెలిపారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం జమ్మికుంటలోని వర్తక సంఘం కమ్యూనిటీ హాల్ లో శిక్షణ పొందుతున్న యోగా మిత్రులకు నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ దేశంలో 14 లక్షల మంది చీకటి జీవితాలను అనుభవిస్తున్నారని, వారిలో 60 శాతం మంది 12 సంవత్సరాల లోపు బాల బాలికలు ఉండడం బాధాకరమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కార్నియల్ అంధత్వరహిత తెలంగాణ రాష్ట్రం కోసం సదాశయ ఫౌండేషన్ గత 14 సంవత్సరాలుగా కృషి చేస్తున్నదని తెలిపారు. అంధత్వ నివారణకు మరణానంతరం మనం చేసే నేత్రదానం వలన ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చునన్నారు. చనిపోయిన వ్యక్తి ఇంటికే వచ్చి నేత్ర సేకరణ చేస్తారని ఆయన పేర్కొన్నారు. మరణానంతరం ఎందుకూ ఉపయోగపడని శరీర భాగాలను దానం చేసి మానవ జన్మను ధన్యం చేసుకోవాలని నరహరి పిలుపునిచ్చారు.

## మట్టి గణపతులతో పర్యావరణ రక్షణ: విద్యాసాగర్



జగిత్యాల, ఆగస్టు 28 (మనం న్యూస్)ఃమట్టి గణపతులు పర్యావరణ పరిరక్షిస్తాయని జాతీయ హరిత దళం తెలంగాణ ప్రాంత ప్రాజెక్టు అధికారి బి.విద్యాసాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ హరిత దళం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రతిమల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల నిమజ్జనం జలచరాలకు ప్రాణసంకటంగా మారడంతో పాటు కలుషిత నీరు తాగిన ఇతర ప్రాణుల మనుగడకు విఘాతం కలిగిస్తాయన్నారు. వినాయక చవితికి అందరూ సహజమైన బంక మట్టితో తయారుచేసిన వినాయకుని పూజించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో వినాయకుని మట్టి విగ్రహాలు తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బాజోజి శ్రీనివాస్ పాఠశాల ఎన్జీసీ ఇంచార్జ్ బోయినిపెల్లి ఆనంద్ రావు ప్రధానోపాధ్యాయులు రామానుజం, ఉపాధ్యాయులు దేవయ్య, విద్య, పద్మ, మల్లికార్జున్, అనిత, హరిత, శ్రీనివాస్, సురేందర్, అరుణ, అమల, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల నాయకులకు దక్కిన గౌరవం





## సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా.. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్యల ఎన్నిక

మంచిర్యాల, ఆగస్టు 28 (మనం న్యూస్)ః గత మూడు రోజుల పాటు జరిగిన ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 16వ మహాసభల సందర్భంగా యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఆర్జి వన్ ఏరియాలోఈ నెల 25 ,26 , 27 తేదీలలో 518 మంది ప్రతినిధుల మధ్య జరిగిన సమావేశాల్లో డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన నాయకులు కె.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్యలను ఎన్నుకున్నారు.

ః వీరభద్రయ్య ఉద్యమ ప్రస్థానం:

డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన కె వీరభద్రయ్య గత నాలుగు దశాబ్దాల కాలం నుండి కార్మిక వర్గానికి సేవలందిస్తున్నారు. విద్యార్థి దశలోనే భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘం అయిన ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా పనిచేసివిద్యార్థుల సమస్యల ఎడల రాజీలేని పోరాటం చేశారు. పి.నరసయ్య వారసత్వంలో పెరిగిన వీరభద్రయ్య విద్యార్థి దశ నుంచి కార్మిక రంగంలోకి రావడం జరిగింది. నాటి నుంచి నేటి వరకు కార్మిక వర్గ సమస్యలే ఏజెండాగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బలోపేతం చేయ డానికి అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు వెళుతున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర కమిటీ మరొకసారి వీరభద్రయ్య ను డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా కొనసాగించాలని తీర్మానించి మూడవసారి ఎన్నుకున్నారు. కార్మిక వర్గానికి సేవ చేస్తున్న క్రమంలో ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొని నిర్బంధాలను లెక్కచేయకుండా సంఘ నిర్మాణానికి ఆయన కృషి చేశారు. అక్రమ అరెస్టులు, అక్రమ చార్జిషీట్లు , సస్పెండ్ లకు గురి అయిన కార్మిక వర్గం కొరకు దృఢంగా నిలబడ్డారు.

ః ముస్కే సమ్మయ్య ఉద్యమ ప్రస్థానం...

డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన ముస్కే సమ్మయ్య గత నాలుగు దశాబ్దాల కాలం నుంచి కార్మిక వర్గానికి సేవ లందిస్తున్నారు. విద్యార్థి దశలోనే ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్ యూనియన్ నాయకునిగా జీవితాన్ని ప్రారంభించిన ఈయన విద్యార్థుల సమస్యల కొరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజీలేని పోరాటం చేశారు. ఆ క్రమంలోనే 1983లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ పుస్తకాల రేట్లు పెంచితే విప్లవ విద్యార్థి సంఘాలైన ఆర్ఎస్‌యు, పిడిఎస్‌యు, డిఎస్ఓల ఆధ్వర్యంలో జరిగిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆపోరాటానికి నాయకత్వం వహించిన సమ్మయ్య విద్యార్థి పోరాటాలే కాకుండా భూ పోరాటాలు, పల్లెల్లో జరుగుతున్న దోపిడీ, అణిచివేతకు నిరసనగా ఉద్యమించారు. ఆ తరువాత కార్మిక రంగంలోకి వచ్చి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అనుబంధ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో మూడు, నాలుగు, ఐదవ వేజ్ బోర్డ్ సమ్మెలో అగ్ర భాగాన నిలిచి పోరాటం చేశారు. తద్వారా వేజ్ బోర్డ్ అగ్రిమెంట్లు కూడా జరిగాయి. ఈ సందర్భంగా యాజమాన్యం చార్జీ షీట్లు,సస్పెండ్లు , ఇంక్రిమెంట్ కోతలు, బదిలీలతో వేధించినప్పటికీ కార్మిక వర్గ దృక్పథంతో ఆయన దృఢంగా నిలబడి పోరాటం చేస్తూనే ఉన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామ క్రమంలో తెలంగాణ సాధన ధ్యేయంగా వేలాది మంది విప్లవవిద్యార్థి సహచరుల సూచన మేరకు సమిష్టిగా బిఆర్ఎస్, టిజిబికెఎస్ నాయకత్వంతో కలిసి పనిచేశారు. వందలాదిమంది ఆత్మ బలిదానాలు, ఆబాల గోపాలం కార్మికులు ,కర్షకులు విద్యార్థులు మేధావులు ,మహిళలు ,ప్రభుత్వరంగ సంస్థలు , సింగరేణి గని కార్మికుల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పాటు అయింది. తద్వారా మారిన పరిణామ క్రమంలో రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిలబడాలంటే భారతకమ్యూనిస్టు పార్టీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ,ఏఐటియుసి మాత్రమే అని నమ్మి, సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్న సమ్మయ్య సింగరేణి కార్మికుల హక్కులు, సౌకర్యాలు కాపాడబడాలంటే కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తోటి మాత్రమే సాధ్యమని యూనియన్ లోకి వచ్చారు. గత 8 సంవత్సరాల నుండి యూనియన్ నాయకత్వంలో కార్మిక వర్గాన్ని ఏకం చేయటంలో అగ్ర భాగం నిలబడి ముందుకు సాగుతున్నారు.. ఆయన పోరాటాన్ని వారు చేస్తున్న కృషిని సంఘ నిర్మాణంలో దృఢంగా నిలబడుతున్న తీరును గుర్తించిన కేంద్ర కమిటీ ఈ మహాసభలలో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎంపిక చేసింది.

# ఎస్ఎస్ఏ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి

## జిల్లా జెఏసి అధ్యక్షులు ఆంజనేయులు

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 28 (మనం న్యూస్)ః సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జెఏసి జిల్లా అధ్యక్షులు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పటివరకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు పది లక్షల రూపాయల జీవిత బీమా, ఐదు లక్షల రూపాయల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులందరికీ 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ధర్నా కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ 29, 30 రోజుల్లో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఎస్ జిల్లా అధ్యక్షులు దీప్తి, సుకన్య, వరలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షులు




జిలాని, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల జిల్లా అధ్యక్షుడు కనుకుల రమేష్, లక్ష్మీనారాయణ, డిపిఓ స్టాఫ్ రాజశేఖర్, శ్రీనివాస్, భరత్, శంకర్ ,యుఆర్ఎస్ ఉపాధ్యాయులు రాజమౌళి, రవిచంద్ర, మహేందర్, రమేష్, నరోత్తం, నాగరాజు, మధు, రవిబాబు, చక్రపాణి, మహేష్, శ్రీనివాస్, మహిళా ఉద్యోగులు మంగ, పద్మ, రజిత, స్వప్న, రాజేశ్వరి, పావని, కళతో పాటు దాదాపు 400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహిళలు షీ టీం సేవలను వినియోగించుకోవాలి

## ః ఎస్సై రామయ్య

లక్షెట్టిపేట్, ఆగష్టు 28 (మనం న్యూస్): మహిళ లు షీ టీం సేవలను విని యోగించుకోవాలని ఎస్సై రామయ్య తెలిపారు. సోవ ఎవారం పట్టణంలోని వాగేశ ్వరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే 'షీ'టీం కర్తవ్యమన్నారు. మహిళలు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అలాగే పిల్లలకు సైబర్ నేరాల గురించి, చిన్నపిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించాలని మార్గనిర్దేశం చేశారు. కాలేజీ కి వచ్చే, పోయే క్రమంలో ఆకతాయిలు వేధిస్తే 100 కు డయల్ చేసి పోలీసులకు వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీ టీం బృందాలు మఫ్టీలో బస్ స్టాప్, రద్దీ ప్రదేశాల్లో ఉంటారని తెలిపారు. ఏ ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నెంబర్ లో సంప్రదించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఎఎస్సై ఓబులమ్మ, అధ్యాపకులు, కానిస్టేబుల్ శ్రావన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రెండో ఎఎన్ఎంల ధర్నా



మంచిర్యాల, ఆగస్టు 28 (మనం న్యూస్): కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు అనుబంధ తెలంగాణా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు రెండో ఎఎన్ఎంలు చేపడుతోన్న ధర్నా సోమవారంతో పదిహేను రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్లకార్డులతో నిరసన తెలిపిన ఎఎన్ఎంలు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ బానోతు సంతోష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యవతి,రాజేశ్వరి,ఆదిలక్ష్మి తదితరులు పాల్గొంటున్నారు.

# ఓటు సవరణ, నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలి



## బిజెపి మండల ఉపాధ్యక్షులు వంశీకృష్ణ

చిగురుమామిడి, ఆగస్టు 29 (మనం న్యూస్)ః ఓటు సవరణ, నమోదు పైన గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతూ బిజెపి మండల ఉపాధ్యక్షులు బోయిని వంశీకృష్ణ సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఓట్ల సవరణ, నమోదు విషయంలో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ఓట్ల మార్పు, చేర్పుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరముందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారు సరైన సమాచారం, అవగాహన లేక ఇంకా ఓటర్లుగా నమోదు చేసుకోలేదని వంశీకృష్ణ తెలిపారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు కూడా వారి ఓట్లను నివసించే ప్రదేశాలకు బదిలీ చేసుకునే విషయంలో సరైన అవగాహన లేక మార్పులు చేసుకోవడం లేదన్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజలలో అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మీడియా ఇంచార్జి బోయిని ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

### మంత్రి గంగుల కమలాకర్

### వికలాంగులకు సెల్ ఫోన్ల పంపిణీ



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 28 (మనం న్యూస్): ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని బిసి సంక్షేమం, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ నుండి టిఎస్ఒబిఎంఎస్ పథకం ద్వారా బదిర వికలాంగులకు మంజూరైన సెల్ ఫోన్ లను జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న దివ్యాంగులు టీఎస్ఓబి ఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ టి ఎస్ఒబిఎంఎస్ ద్వారా జిల్లాలో 51శాతం కంటే ఎక్కువ చెవిటి ఉన్న ఐదుగురికి సెల్ ఫోన్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఇంటర్, డిస్టెన్స్ చదివే 16 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారిని, డిగ్రీ ఆ పైన చదువుతున్న18 నుండి 25 సంవత్సరాల వయస్సు వారు, 16 నుండి 50 సంవత్సరాల పైబడి ఎస్సెస్సీ చదివిన వారిని అర్హులుగా గుర్తించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఇతర అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

### స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్

### ఈవిఎం యంత్రాలు,వివి ప్యాట్ల వినియోగంపై అవగాహన




కాల్వశ్రీరాంపూర్,ఆగస్టు 28 మనం న్యూస్ : అర్హులు ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండి రానున్న ఎన్నికలలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ రౌఫ్ ఖాన్ అన్నారు. సోమవారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని వాసవి డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతను,ఓటర్ నమోదు,ఓటు హక్కు సద్వినియోగంపై,ఈవిఎం యంత్రాలు,వివి ప్యాట్ల వినియోగంపై కల్పించిన అవగాహన కార్యక్రమంలో స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్ తహసీల్దార్ జాహెద్ పాషతో కలిసి పాల్గొన్నారు. స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్ మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టామని,అర్హులందరికి ఓటు హక్కు కల్పించుటకు సహకరించి పక్కా ఓటరు జాబితా రూపకల్పనకు గాను తోడ్పడాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ,అక్టోబరు 1-2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారందరూ తప్పనిసరిగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని,అర్హులు అందరూ విధిగా ఓటు హక్కును నమోదు చేసుకొని ఉండాలని తెలుపుతూ,ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఈవిఎం యంత్రాలు,వివి ప్యాట్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్ పాష,ప్రిన్సిపల్,లెక్చరర్స్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

మంచిర్యాల, ఆగస్టు 28 (మనం న్యూస్ ): మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. వివిధ రకాల సమస్య లతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించారు. ప్రధానంగా చెన్నూరు, నస్పూర్, లక్సెట్టిపేట్, మంచిర్యాల, బెల్లంపల్లి, తదితరుల ప్రాంతాలనుంచి దరఖాస్తులు వెలువెత్తాయి. స్వయంగా జిల్లా కలెక్టర్ బానోత్ సంతోష్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తు దారుడి దరఖాస్తు ను చదివి పరిశీలించడమే కాకుండా బాధితుల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. భూముల విషయంలో ధరణిలో వస్తున్న సమస్యలు, వికలాంగులు, వృద్దులు పెన్షన్ తదితర సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్కువగా భూముల సమస్యలే అధికంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా డిపిఆర్.ఓ సంపత్ కుమార్, ఇతర అధికారులు, జిల్లాలోని అన్ని మండలాల తహీసీల్దార్‌లు పాల్గొన్నారు.



**: నాకు మూడు చక్రాల వాహనం కావాలని వచ్చాను:**

**: జుమ్మిడి పోశం, వికలాంగుడు.**

మాది మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రావల్ పల్లి గ్రామం. రెండు కాళ్ళు చచ్చు పడ్డాయి. నడవాలన్నా, ఎటైనా ఎల్లాలన్న సానా కుట్టం అవుతాంది. నా ఘోస కలెక్టర్ సారుకు చెప్పుకుంటే సాయం అందిత్తరని ఇక్కడకు అచ్చినా.. నాకు మూడు చక్రాల వాహనం ఇవ్వాలని సార్లకు దండం పెట్టినా..





**నా భూమిలో గురుపాఠశాల కట్టారు**

**- మాజీ నక్షలైట్ ఆసరెల్లి సమ్మయ్య**

మాది కోటపల్లి మండలం దేవులాడ గ్రామం.నేత కాని కులం. కూలి పని చేసుకుంటూ బతుకుతున్న. నేను గతంలో పీపుల్స్ వార్ మావోయిస్టు పార్టీ లో పనిచేసాను. నేను ప్రభుత్వానికి లొంగి పోయినందుకు 2004 సంవత్సరంలో పునరావాసం కింద చెన్నూర్ గ్రామంలోని సర్వే నంబర్ 631లో రెండు గుంటల భూమి నివాసం కోసం ఇచ్చిండ్రు. కానీ నా నివాస స్థలంలో 2014 లో టిఎస్‌డబ్ల్యూఆర్ఇ వాళ్ళు గురుకుల పాఠశాలను నిర్మించారు. నాకు ఇల్లు లేక అద్దె ఇంట్లో వుంటూ కూలి పని చేసుకుంటున్నాను. కావున సహృదయం తో నాకు వేరొక చోట ఇంటి నివాస స్థలం కేటాయించాలి.

## సంజీవరావు సేవలు గణనీయం



రామగిరి,ఆగస్టు 28 మనం న్యూస్ : సింగరేణి ఓసిపి-2 ఉద్యోగి చేతల్లా సంజీవరావు సేవలు గణనీయమని టిబిజికేఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి,ఆర్జీ-3 ఉపాధ్యక్షులు గౌతమ్ శంకరయ్య,రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివిరావు అన్నారు. సోమవారం సంజీవరావు కుమారుడు రాష్ట్ర మంత్రి హరీష్‌రావు,పి ఆర్ఓ చేతల్ల అజయ్ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీ కమిటీ హాల్‌లో సంజీవరావు ప్రథమ వర్ధంతి సంతాప సభ జరిగింది. ప్రతి ఒక్కరు సంజీవరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, టిబిజికే ఎస్ నాయకులు దేవ శ్రీనివాస్,బుద్దే ఉదయ్,తన్నీరు ప్రదీప్ ,ఓర్రే సురేష్,శ్రీకాంత్‌రావు,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు సస్య రక్షణ పై అవగాహన

వెల్గటూర్,ఆగస్టు 28(మనం న్యూస్) రైతులకు పంట తెగుళ్ల, సస్య రక్షణ పై అవగాహన కల్పించేందుకు సోమవారం మండలంలోని గొడిసెల పేట గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి అయ్యోరి వినోద్ ఆద్వర్యంలో క్రాప్ దర్శన్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో ముఖ్యంగా వరి,పత్తి పంటలలో తరచూ వచ్చే రోగాలను, తెగుళ్లను రైతులు సులభంగా గుర్తించి ,సస్య రక్షణ మార్గాలు తెలిపడానికి తెలంగాణ వ్యవసాయ శాఖ అద్వర్యంలో క్రాప్ దర్శన్ యాప్ ను రూపొందించారని గ్రామాలలో స్మార్ట్ ఫోన్ ను కలిగిన ప్రతి అభ్యుదయ రైతులు ఈ యాప్ గురించి వివరించామని, రైతుల ఫోన్ లలో వేసి ఉపయోగించే విధానం రైతులకు వివరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లష్టర్ గ్రామాల అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మెట్ పల్లి,ఆగస్టు 28( మనం న్యూస్ )కోరుట్ల నియోజకవర్గంలో మల్లాపూర్ మండల కేంద్రంలో గల వడ్డెర కాలనీ వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి, మల్లాపూర్ లో గల సోమన్న గుట్ట ఘాట్ రోడ్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తో కలిసి మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర కాలనీలో హై లెవెల్ బ్రిడ్జి రూపాయలు రెండు కోట్ల 20 లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు ఈ నిర్మాణంతో మల్లాపూర్ మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరుతుందన్నారు అలాగే 10 కోట్ల రూపాయలతో సోమన్న గుట్ట ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టవుతున్నట్లు వారు తెలిపారు. రానున్న రోజుల్లో మళ్లీ తెలంగాణ లో బి ఆర్ ఎస్ ప్రభుత్వమే ఏర్పడడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, కోరుట్ల బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ నియోజకవర్గంలోని జెడ్పిటిసిలు, ఎంపీపీ,ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు అధికారులు,మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ సాధారణ సమావేశం



రామకృష్ణాపూర్,ఆగష్టు 28 (మనం న్యూస్)క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం లో చైర్ పర్సన్ జంగం కళ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో 6 అంశాల ఎజెండాను మేనేజర్ నాగరాజు కౌన్సిల్ సభ్యులకు చదివి వివరించగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.అలాగే విద్యుత్ ఏ ఇ జయకృష్ణ పట్టణంలోని విద్యుత్ స్థంబాలు ఏర్పాటు మార్పిడి,విద్యుత్ లైన్ మార్పిడి సమస్యలపై గురించి కౌన్సిల్ సభ్యులకు వివరించి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకటనారాయణ, కమీషనర్,వైస్ ఛైర్మన్ ఏర్రం విద్యా సాగర్ రెడ్డి,కౌన్సిల్ సభ్యులు,కో ఆప్షన్ సభ్యులు,రెవెన్యూ అధికారి కృష్ణ ప్రసాద్,ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్, జూనియర్ అసిస్టెంట్,ప్రదీప్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిఎస్పిని ప్రజలందరూ ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలి

**- సమస్యల పరిష్కారం కోసం మరో రెండు మాసాలు వేచి ఉండాలి**

**- బిఎస్పి ప్రభుత్వంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం**

**- బిఎస్పి పెద్దపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ దాసరి ఉష**

సుల్తానాబాద్,ఆగస్టు 28 మనం న్యూస్ : సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి గ్రామాలలో మన ఊరు - మన ఉష 30 వ రోజు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బిఎస్పి పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి ఉష గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ,సమస్యల పరిష్కారం కోసం మరో రెండు మాసాలు వేచి ఉండాలని,బిఎస్పి ప్రభుత్వంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల నుండి గ్రామాల వైపు చూడని ఎమ్మెల్యే ఇప్పుడు ఎన్నికల ముందు ప్రజలను మభ్య పెట్టడానికి గ్రామాల్లోకి వస్తున్నారని,గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేసిన,కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ఆ రెండు పార్టీలు ఒకటేనని,ఎమ్మెల్యేలు అయిన తర్వాత సొంత స్వభావాల కోసం పార్టీ లు మారడానికే తప్ప ప్రజలకు చేసేదేమీ లేదని కేవలం బహుజన సమాజ్ పార్టీ మాత్రమే ప్రజలకోసం ఉద్యమాలు చేస్తూ రాజ్యాధికారం దిశగా ముందుకు వెళుతుందని, బిఎస్పిని ప్రజలందరూ ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని గత 30 రోజులుగా మన ఊరు మన ఉష కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న బహుజన సైనికులందరికి ఆ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో బిఎస్పి పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్‌పటేల్,జిల్లా జోనల్ కన్వీనర్ కుమ్మరి సవిత,జిల్లా మహిళ కన్వీనర్ పూరేల్ల స్వప్నగౌడ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ కల్వల శోభ,అముదల అరుణ,సుల్తానాబాద్ మండలం ఉపాధ్యక్షులు కల్వల భూమయ్య,ఆషాడపు రాములు,మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి నర్సయ్య, మండల కోశాధికారి అల్లేపు చంద్రశేఖర్,పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు రామిళ్ళ శారధ,కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షులు కుమ్మరికుంట రవికుమార్,బివిఫ్ జిల్లా మచ్చ రాహుల్,వివిధ మండల కమిటీ సభ్యులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు బివిఫ్ టీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి తీర్మానం



రామగిరి,ఆగస్టు 28 మనం న్యూస్ : రామగిరి మండలం బేగంపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం ఎంపిపి ఆరెల్లి దేవక్క కొమురయ్య అధ్యక్షతన జరిగింది. త్రాగునీటి ఎద్దడి తీర్చడానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపిపి దేవక్క ప్రకటించారు. ఇప్పటివరకు కలెక్టర్ కేటాయించిన రూ.4 లక్షల నిధులు జరిగిన అభివృద్ధి పనులపై చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ఫ్యాన్ ల మరమ్మతులు చేయాలని,కుర్చీల ఏర్పాటు ఇతర పనులకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డాక్టర్లు ఎం.సంపత్‌కు మార్ ,ఐ.ప్రదీప్,కమిటీ సభ్యులు సర్పంచ్ బుర్ర పద్మ శంకర్(బేగంపేట),పల్లె ప్రతిమ పివిరావు (రత్నాపూర్),ఎంపిటిసిలు మారగోని కరుణ కుమారస్వామి (బేగంపేట),సిహెచ్ఓ బి.భరత్,ఎంసిహెచ్ఓ ఏ,సీతారామయ్య పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ద్వారా 10,000 రూపాయల నిత్యావసర సరుకులు అందజేత



రామగిరి,ఆగస్టు 28 మనం న్యూస్ : సోమవారం కల్వచర్ల గ్రామంలో గొంతు సత్తయ్య అకాల మరణం చెందగా వారి కుటుంబానికి పదివేల రూపాయఅల నిత్యవసర సరుకులు లైన్స్ క్లబ్ సెంటినరీకాలనీ ద్వారా వారి కుటుంబానికి అందజేయండం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ గంట పద్మ వెంకటరమణారెడ్డి 5000 రూపాయల ఆర్థిక సాయం,దొంతుల సురేష్ 2500,గుండా సుధాకర్ 2500 ఆర్థిక సాయం చేయగా మొత్తం రూపాయల క్వింటల్ బియ్యం నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్,లైన్ డైరెక్టర్ అబ్బో కేశవరెడ్డి,టివి సురేష్‌బాబు,దొడ్ల శ్రీనివాస్,సత్యనారాయణ టీచర్,తీగల శ్రీధర్,కొట్టే స్వామి,వార్డు మెంబర్ బూస బాపన్న,మహేష్,గొంతి సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు.

## కస్తూరిబా భవనం వెంటనే పూర్తిచేయాలి

## ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం



రామగిరి,ఆగస్టు 28 మనం న్యూస్ : రామగిరి మండలంలోని పన్నూరు గ్రామంలో నిర్మిస్తున్న కస్తూరిబా పాఠశాల మూడు సంవత్సరాలుగా నిర్మాణం జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని,ప్రస్తుతానికి సింగరేణి భవనంలో ఉన్న 202 విద్యార్థులు వారి సమస్యలు కూడా పట్టించుకోవడం లేదని,ఇరుకు గదులలో అనేకమైన సమస్యలు,డెస్క్ టేబుల్స్ లేకపడుకోవడానికి బెడ్స్ లేక సరియైన స్నానపు గదులు టాయిలెట్స్ లేక అనేకమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిల్లల తల్లిదండ్రులు ఎన్నిసార్లు చెప్పినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని,డిఈ ఓ కూడా ఇప్పటివరకు కస్తూర్బా పాఠ శాలను సందర్శించలేదని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సోషల్ వెల్ఫేర్ అధికారుల నిర్లక్ష్యం వల్ల బిల్డింగ్ తొందరగా పూర్తికావడం లేదని,లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బిజెపి జిల్లా ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు.

## మార్కెండేయ దేవాలయంలో భక్తులకు అన్న వితరణ



సుల్తానాబాద్,ఆగస్టు 09 మనం న్యూస్ : లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో పవిత్ర శ్రావణ సోమవారం సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామం మార్కండేయ దేవాలయంలో ఆలయ చైర్మన్ వసల నీలయ్య సారథ్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా లయన్ దీకొండ భూ మేష్ కుమార్,కట్ల సంపత్,ఆడెపు పాండు రంగ,రవీందర్ సుమారు 350 మంది ప్రజలు,భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి ,జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య,జిల్లా కో ఆర్డినేటర్ మాటేటి శ్రీని వాస్,పూర్వ అధ్యక్షులు దీకొండ భూమేష్ కుమార్,కోశాధికారి రాయెల్ల నవీన్,కట్ల సంపత్ ,ఆడెపు పాండు రంగ,రవీందర్,భారీగా మహిళా భక్తులు,దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి సమస్య ఉన్న 100కు డయల్ కాల్ చేయండి

**- జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ**

**- జూలపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో షీటీమ్,సైబర్ క్రైమ్ పై అవగాహన**



సుల్తానాబాద్,ఆగస్టు 28 మనం న్యూస్ : సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో గల జూలపల్లి మండల పరిధిలోని టిఎస్ మోడల్ స్కూల్ నందు జూలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థి,విద్యార్థినులకు డయల్ 100,షీటీమ్, సైబర్ క్రైమ్ పై జూలపల్లి ఎస్సై వెంకట కృష్ణ,పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్న 100కు డయల్ కాల్ చేయాలని వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరించుతారన్నారు. అదే విధ ంగా విద్యార్థినులు స్కూల్,కాలేజికి వచ్చి,పోయే సమయంలో ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే మ ఈ సమస్యను పోలీసులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లో గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,తల్లి దండ్రుల మీద, ఉపాధ్యాయుల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. ఈ మధ్య కాలంలో అన్‌లైన్‌లో చాలామంది నష్టపోతున్నారని ,ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు అడిగిన మీకు మీ తల్లి దండ్రులకు ఫోన్ చేసి మీకు ఇస్తమని చెబితే నమ్మకూడదన్నారు. ఎలాంటి పని ఉన్న నేరుగా బ్యాంక్ వెళ్లి సమస్యను పరిష్కరించుకోవలన్నారు. ఇతరులు ఫోన్ చేసి మీకు ఓటిపి వచ్చింది చెప్పమంటే చెప్పకూ డదన్నారు. అనంతరం వస్తున్న రాఖీ పండగ సందర్భంగా విద్యార్థినులు ఎస్ఐ కి పోలీస్ సిబ్బందికి రాఖీ కట్టి శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి ఎస్సై వెంక టకృష్ణ, సిబ్బంది ,కళాశాల సిబ్బంది,విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ,శ్యాంప్రసాద్‌లాల్**



పెద్దపల్లి, ఆగస్టు 28(మనం ప్రతినిధి): ప్రజావాణి దరఖాస్తులను అ. దికారులు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌లు తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్‌లు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా అర్జీదారుని సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, ఒకసారి ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులు మరోసారి రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు.

# పెద్దపల్లి బిఆర్ఎస్ టికెట్ బొద్దుల లక్ష్మణ్‌కు కేటాయించాలి

## ఎలిగేడు మండల పద్మశాలి సేవా సంఘం తీర్మానం

ఎలిగేడు,ఆగస్టు 27 మనం న్యూస్ ః పెద్దపల్లి ఎమ్మెల్యే బిఆర్ఎస్ టికెట్ బిసి నాయకుడు,పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,కెసిఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పిటిసి బొద్దుల లక్ష్మణ్‌కు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రాంలోని పద్మశాలి సంఘ భవనంలో పద్మశాలి మండల సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ,పద్మశాలి సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ బూర్ల సత్యానారాయణ,పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మామిడాల రమేష్,గ్రామశాఖ అధ్యక్షుడు బూర్ల వెంకటసత్యం,యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో పద్మశాలి కులస్థుల ఓట్లు దాదాపు 40 వేల పైచిలుకు వరకు ఓట్లు ఉన్నాయని,అయినప్పటికి కూడా పద్మశాలి కులస్థులకు టికెట్ కేటాయించకుండా మళ్లీ దాసరికే కేటాయించడం,సర్వేలన్నీ దాసరికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ టికెట్ ఇవ్వడం ఏమిటని అన్నారు. కెసిఆర్ సేవాదళం పేరిట నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలను బొద్దుల లక్ష్మణ్ తన అనుచరులతో చేయిస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డార ని,ఎంతోమంది బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆపదలో ఆదుకున్నాడని అన్నారు.

రానున్న ఎన్నికలలో దాసరి మనోహర్‌రెడ్డికి పద్మశాలిల ఓట్లు వేసే ప్రసక్తే లేదని తీర్మానం చేశారు. బొద్దుల లక్ష్మణ్‌కు టికెట్ కేటాయిస్తే బిసిలు అందరం ఎకతాటిపైకి వచ్చి గెలిపించుకుంటామని, లేదంటే తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బిసిలకు అందులోనూ పద్మశాలిలకు చేసింది ఏమి లేదని ఆవేదన వ్యక్తం



చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బింగి రాజు, వెంగలదాస్ భాస్కర్,కట్ల సత్యం,బొద్దుల వెంకన్న ,సాయినాథ్, వెంగలదాస్ రాజమౌళి,కట్ల ప్రకాష్,పర్శ శ్రీనివాస్, మల్లేశం, కుమారస్వామి, దూడెం వీరేశం,సత్యనారాయణ,కట్ల రవి,ప్రభాకర్ ,రాజమల్లయ్య, మల్లేష్, కనుకయ్య ,రమేష్,పెంటయ్య,రాజేశం,కట్ల శంకరయ్య,రవీందర్,పద్మశాలి మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయేషా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



బోధన్, ఆగస్టు 28 (మనం న్యూస్)ః ఎమ్మెల్యే షకీల్ అమెర్ సతీమణి, అయేషా ట్రస్ట్ చైర్‌పర్సన్ అయేషా ఫాతిమా జన్మదినం సందర్భంగా పాండు ఫారం ప్రైమరీ స్కూల్ లో విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయేషా వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేయటం చాలా ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో మరింత మందికి వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా చేతనైనంత సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాగన్ పల్లి మధు, జేఏసీ శంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్లు ఓటు హక్కు పొందాలి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు

కొమురంభీం ఆసిఫాబాద్, ఆగస్టు 28 (మనం న్యూస్)ః జిల్లాలోని ట్రాన్స్ జెండర్లు వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొందాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్‌డిఓ సురేష్‌తో కలిసి ట్రాన్స్ జెండర్లతో ఓటు నమోదు పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ట్రాన్స్ జెండర్ తప్పకుండా ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకుని ఓటరు గుర్తింపు కార్డులు పొందాలని తెలిపారు. ప్రతి ట్రాన్స్ జెండర్ ఆధార్ కార్డు ప్రతులు, చిరునామా వివరాలు సమర్పించి ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, అర్హత గల మిగతావారు కూడా ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ట్రాన్స్ జెండర్ల సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల డిటి జితేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాల్సిందే

కాల్వశ్రీరాంపూర్,ఆగస్టు 28 మనం న్యూస్ ః పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాం పూర్ మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్నటువంటి పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కాల్వశ్రీరాంపూర్ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం సుమారు రెండు వేల మందితో ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లగా పోలీసులు అడ్డుకొని గేటుకు తాళం వేసి మీరు ఏమైనా చేయదలచుకుంటే బయట చేసుకోండి లోపలికి వెళ్లడానికి మీకు ఎటువంటి అనుమతి లేదని పోలీసులు చెప్పగా మాజీ ఎమ్మెల్యే విజయ రమాణారావు కలగజేసుకొని మేము ఎటువంటి గొడవకు రాలేదని పేదల ఇండ్ల కోసం ఎమ్మార్వోకు శాంతియుతంగా మా బాధను ప్రజల తరపున వివరణ ఇచ్చేందుకు వచ్చామని తెలిపిన అనుమతి ఇవ్వకపోవడంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం కేవలం పదిమందికి మాత్రమే అనుమతి ఇవ్వగా ముఖ్య నాయకులు కార్యాలయం ఆవరణలో నికి వెళ్లారు. అనంతరం ఈ కార్యక్రమం యొక్క ముయ ఉద్దేశం గురించి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేపై తనదైన శైలిలో మాటలతో విరుచుకుపడుతూ దాసరి మనోహర్‌రెడ్డికి కేవలం ఇసుక మట్టి దందాల మీద ఉన్నప్రేమ ప్రజల మీద లేదని,మా పార్టీలో చేరితే మీకు బీసీ బందు దళిత బంధు గృహలక్ష్మీ వంటి సంక్షేమ పథకాలు వస్తాయని ప్రలోభ పెడుతూ మాయ మాటలు చెప్పి కండువాలు కప్పుతున్నారే తప్ప ఎటువంటి ప్రేమ లేదని వారు ఎద్దేవ చేశారు. మొత్తం మండలంలో ఇల్లు లేని పేదలు చాలామంది ఉన్నారని పాండవుల గుట్ట వద్ద సుమారు నాలుగు సంవత్సరాల నుండి 275 ఇళ్ళను కడుతూ ఉన్నారే తప్ప నేటికి పూర్తి చేయక అవి ఎందుకు పనికిరాక అసంపూర్తిగా ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. బ్రాండీ షాపులకు 15 రోజులు దరఖాస్తులు కోసం అవకాశం కల్పిస్తే గృమలక్ష్మీ దరఖాస్తుల కోసం కేవలం మూడు రోజులు మాత్రమే ఇచ్చారని దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వానికి పైసల మీద ఉన్న ప్రేమ పేదవారి కొరకు లేదని దీన్ని బట్టి చూస్తే అర్థమవుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 కే గ్యాస్ సిలిండర్లు,18 సంవత్సరాలు దాటిన మహిళ విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని ఎస్సీ,ఎస్టీ





పేద వారికి సొంత జాగాతో పాటు ఇల్లు కట్టుకుంటే ఆరు లక్షల రూపాయలు ఇస్తామని,గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లే తప్ప టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లు ఎక్కడలేవని కొన్ని ఇండ్లు గోడల వరకు వచ్చి నిలిచిపోగా మేం అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి రెండు లక్షల 50 వేల రూపాయలు ఇచ్చి ఇండ్లు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాలలోనికి వచ్చినప్పుడు నీకు చెప్పు చీపురులతో స్వాగతం పలుకుతారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వాన్ని స్థానిక ఎమ్మెల్యేను మెడలు వంచి అర్హులందరికి ఇండ్లు వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విజయరమణారావు అను వ్యక్తి రెండుసార్లు ఓటమి చెందిన ప్రజల మధ్య ఉన్నాడే తప్ప కొబ్బరికాయలు కొట్టి తలదించుకొని నీ లెక్క పోయే వ్యక్తిని కాదు అని దుయ్యబట్టారు. అనంతరం తహసీల్దార్ జావేద్ భాషాకు 3,500 దరఖాస్తులు ఇచ్చి అందరికీ ఇండ్లు వచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు,మాజీ ఎమ్మెల్యే బిరుదు రాయమల్లు,మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య, ఆప్కాబ్ చైర్మన్ చేతి ధర్మయ్య,మాజీ జెడ్పిటిసి గోపగోని సారయ్యగౌడ్,ఎంపిటిసి రావి సదానందం,మండల అధ్యక్షులు ఎండి మునీర్,సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యగౌడ్,మాజీ సర్పంచ్ గాజనవేన సదయ్య, గ్రామశాఖ అధ్యక్షులు అల్లంల దేవేందర్‌యాదవ్,గ్రామప్రధాన కార్యదర్శి కొంతం మధుకర్,మండల యూత్ అధ్యక్షులు శివరామకృష్ణ,మండల బిసి సెల్ అధ్యక్షులు సబ్బని రాయమల్లు,పెద్దపల్లి అసెంబ్లి నియోజకవర్గం కార్యదర్శి మేడి అశోక్‌గౌడ్,గ్రామయూత్ అధ్యక్షులు రానవేణ క్రాంతి కుమార్, ముదిరాజ్ సంఘ అధ్యక్షులు రానవేన శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి పొట్టాల మొండయ్యగౌడ్,బంగారు లావణ్య రమేష్,గ్రామశాఖ మహిళా అధ్యక్షురాలు వడ్లూరి సరిత,నాయకులు పులి ఇంద్రకరణ్‌రెడ్డి,నేదురు రమేష్,ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు గ్రామశాఖ అధ్యక్షులు యువత అధ్యక్షులు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.